క్లుప్తంగా

చురుగ్గా ప్రత్యేక ఓటర్ల నమోదు



ప్రత్యేక ఓటర్ల నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రకాష్‌బాబు

రాయవరం: మండలంలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం ఆదివారం రెండో రోజు కొనసాగింది. పోలింగ్ కేంద్రాల్లో నూతన ఓటర్ల నమోదుతో పాటు, చనిపోయిన వారి ఓట్ల తొలగింపు, ఓటర్ల జాబితాలో సవరణలకు దరఖాస్తులు స్వీకరించారు. 133 మంది ఫారం-6కు దరఖాస్తు చేసుకోగా, 36 మంది ఫారం-7, 72 మంది ఫారం-8కు దరఖాస్తు చేసుకున్నారు. తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు, ఆర్ఐ రామారావులు ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు.

800 దరఖాస్తుల స్వీకరణ

కపిలేశ్వరపురం: నియోజకవర్గంలోని మండపేట పట్టణం, రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లోని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన ప్రత్యేక శిబిరాల్లో ఆదివారం ఫారం 6, 7, 8 దరఖాస్తులను స్వీకరించారు. ఆయా శిబిరాల్లో మొత్తం 800 దరఖాస్తులను స్వీకరించినట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి సుధాసాగర్ తెలిపారు. మండపేట అర్బన్‌లో ఫారం-6కు 78, ఫారం-7కు 52, ఫారం-8కు 98 దరఖాస్తులు వచ్చాయన్నారు. రూరల్ మండలంలో ఫారం ఆరు 125, ఫారం ఏడు 22, ఫారం ఎనిమిదికి 52, రాయవరం మండలంలో ఫారం ఆరు 133, ఫారం ఏడు 36, ఫారం ఎనిమిది 72, కపిలేశ్వరపురం మండలంలో ఫారం ఆరు 51, ఫారం ఏడు 63, ఫారం ఎనిమిది 18 దరఖాస్తులు అందాయి. ఇలా నియోజకవర్గంలో మొత్తం 800 దరఖాస్తులు అందినట్లు వివరించారు.

చూడండి.. స్పందించండి



తరచూ పాడవుతున్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్

కె.గంగవరం: అద్దంపల్లి పంచాయతీ శివారు వత్రపూడిలో తరచూ విద్యుత్తు సమస్యలు తలెత్తుతున్నాయి. గ్రామ ప్రారంభంలో ఏర్పాటు చేసిన పాత ట్రాన్స్‌ఫార్మర్ తరచూ పాడవుతుండడంతో అంతరాయం కలుగుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. వారం రోజుల కిందట ట్రాన్స్‌ఫార్మర్ పాడవడంతో విద్యుత్ సరఫరా లేక నానా ఇబ్బందులు పడ్డామని, ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేస్తే వచ్చి మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించారన్నారు. ఆదివారం మళ్లీ సమస్య తలెత్తిందని వారు వాపోతున్నారు. అధికారులు స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు చొరవ



కొత్తపేటలో శిల్పి వుడయార్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణ ప్రధాన రహదారిలో మహనీయులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాల ఏర్పాటుకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవ తీసుకుంటున్నారు. ఈ విగ్రహాల ఏర్పాటుకు ఇప్పటికే మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ ఏర్పాటు నిర్ణయానికి కృషి చేసిన ఎమ్మెల్సీ తోట ఆదివారం కొత్తపేటలోని శిల్పి వుడయార్‌తో విగ్రహాల రూపకల్పనపై చర్చించారు. దళితుల ఆత్మ గౌరవాన్ని పెంపొందించే విగ్రహాల ఏర్పాటు తమకెంతో సంతోషాన్నిస్తుందని తోట వెంట కొత్తపేట వెళ్లిన దళిత నాయకులు అన్నారు.

ఘనంగా లక్ష బిల్వార్చన

కాజులూరు: గొల్లపాలెంలో పరమశివునికి రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన పూజలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన చుండ్రు వీర్రాజుచౌదిరి, భాగ్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో వేదపండితుడు బాదంపూడి నాగ వెంకట సుబ్రహ్మణ్యం (పండుస్వామి) 15 మంది పురోహితులచే ఉమా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన, పంచామృతాభిషేకాలు చేశారు. పరిసర గ్రామాలకు చెందిన శివ భక్తులు, అయ్యప్ప స్వాములు పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం యాగశాల వద్ద సుమారు రెండు వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు.

కలసి ముందుకెళ్తాం..

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట నియోజకవర్గంలో జనసేన, టీడీపీ పార్టీలు కలసి ముందుకు సాగుతాయని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ అన్నారు. పట్టణంలోని విజయలక్ష్మీనగర్‌లో ఆదివారం 'బాబు ష్యూరిటీ– భవిష్యత్ గ్యారంటీ' కార్యక్రమంలో వారు పర్యటించారు.

చివరిలో అలజడి

- మిచాంగ్ తుపానుతో గుబులు
- ఆందోళన చెందుతున్న రైతన్నలు
- అప్రమత్తమైన వ్యవసాయ శాఖ

రాయవరం/కె.గంగవరం: చి'వరి'లో అలజడి మొదలైంది.. రైతన్నల్లో ఆందోళన రేకెత్తిస్తోంది.. ముంచుకొస్తున్న మిచాంగ్ తుపాను ప్రభావంతో కష్టాలు వెంటాడతాయనే భయం అన్నదాతల్లో నెలకొంది. వారం రోజుల్లో వరి పంట చేతికి వస్తున్న దశలో ఈ హెచ్చరికలతో సర్వత్రా ఆందోళన వెంటాడుతోంది.. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మిచాంగ్ తుపానుగా మారడంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వ్యవసాయ శాఖ అప్రమత్తమైంది. తుపాను ప్రభావంతో వాతావరణం మారి ఈదురు గాలులు, మబ్బులతో వాతావరణం రైతాంగాన్ని ఆందోళనకు గురిచేస్తోంది.

అలాగే పలుచోట్ల వర్షాలు పడుతుండడం ఆందోళనకు గురిచేస్తోంది. క్లస్టర్ పరిధిలో రాయవరం మండలంలో 13,568, మండపేట మండలంలో 14,747, కపిలేశ్వరపురం మండలంలో 14,712, రామచంద్రపురం మండలంలో 17,548, కె.గంగవరం మండలంలో 9,757 ఎకరాల్లో వరి పంట పండించారు. చాలా వరకూ వరి కోతలు పూర్తయ్యాయి. ఆలస్యంగా నాట్లు వేసిన వరి పంట ప్రస్తుతం కోత దశకు చేరుకోగా, ముందుగా వరి నాట్లు వేసిన వరి పొలాల్లో కోతలు పూర్తయ్యాయి. ఇప్పటికే వ్యవసాయశాఖ రైతులను అప్రమత్తం చేసింది. రైతులంతా పొలాల్లో ఉన్న ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని, ఆరుదలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే అమ్ముకోవాలని హెచ్చరికలు జారీ చేసింది. అలాగే సురక్షిత ప్రాంతాలకు తరలించిన ధాన్యాన్ని బరకాలతో కప్పుకొని తడవకుండా చూసుకోవాలని వ్యవసాయ శాఖ రైతులకు విజ్ఞప్తి చేసింది. వరి కోతలు వాయిదా వేసుకోవాలని, వాతావరణ శాఖ సూచనలకు అనుగుణంగా నడుచుకోవాలని విజ్ఞప్తి చేస్తోంది.

కోతలు వాయిదా వేసుకోవాలి

తుపాన్ కారణంగా వాతావరణంలో మార్పుల కారణంగా రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని కె.గంగవరం తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ, వ్యవసాయాధికారి బలుసు రవి సూచించారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో వారు పర్యటించి రైతులను అప్రమత్తం చేశారు. ఇప్పటికే కోసిన వరిని టార్పాలిన్లతో సంరక్షించుకోవడం, ఆరుదలకు వచ్చిన ధాన్యాన్ని మిల్లర్లకు ధాన్యం తరలించాలని కోరారు. నేటి నుంచి మంగళవారం వరకూ వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కలవర పెడుతున్న వానలు

కాజులూరు: కొన్నేళ్లుగా తొలకరి పంట వర్షాల బారిన పడుతూనే ఉంది. వరి సాగు చివరి దశలో అల్పపీడనాలు, తుపాన్లతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది దిగుబడి ఆశాజనకంగా ఉందని, లాభాలు వస్తాయని అనుకుంటున్న రైతన్నలకు మిచాంగ్ తుపాను గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. శనివారం రాత్రి నుంచి నియోజకవర్గంలోని రామచంద్రపురం, కాజులూరు, కె.గంగవరం మండలాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తుండటంతో పొలాల్లో పంట కోతలు, మాసూళ్లు నిర్వహిస్తున్న రైతులు తీవ్ర అగచాట్లు పడుతున్నారు. అధికశాతం రైతులు మాసూళ్లు పూర్తి చేసి ధాన్యం కళ్లాల్లో ఆరబెట్టుకుంటుండగా అక్కడక్కడా కొందరు రైతులు పంట కోతలు చేయిస్తున్నారు. కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యం వర్షాలకు తడిసిముద్దవడంతో ఏదో విధంగా వాటిని రాసులుగా చేసి గడ్డి, బరకాలు కప్పి భద్రపరచారు. ధాన్యం రాసుల కిందకు వర్షపు నీరు చేరుతుండటంతో రైతులు బాటలు చేసి నీరు బయటకు తరలిస్తున్నారు. కోసి పనలుగా ఉంచిన పంట పొలాల్లో నీట నానుతుండటంతో మోపులుగా కట్టి ఒడ్డుకు తెచ్చి మాసూళ్లు నిర్వహిస్తున్నారు.



కె.గంగవరంలో ధాన్యంపై బరకాలు కప్పుతున్న రైతులు



మొగలిపాలెంలో చినుకులు పడుతుండటంతో వరి పడుగు దులుపుతున్న రైతులు



గొల్లపాలెంలో బరకాలు కప్పి ఉంచిన ధాన్యం రాసులు

రైతులకు తోడుగా ప్రభుత్వ యంత్రాంగం



ఫోన్లో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



టేకిలో ధాన్యాన్ని లారీలో లోడ్ చేయించి మిల్లుకు తరలిస్తున్న సచివాలయ సిబ్బంది

కలెక్టర్‌తో చర్చించిన ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): మిచాంగ్ తుపాన్ నేపథ్యంలో నియోజకవర్గంలోని అధికారులు అప్రమత్తమయ్యారు. ఉన్నతాధికారుల ఆదేశాలపై ఆదివారం సెలవును వారికి రద్దు చేశారు. ఆర్బీకే, సచివాలయ, వ్యవసాయ శాఖ ఉద్యోగులు రైతన్నలకు తోడుగా నిలిచారు. ఉదయాన్నే విధుల్లోకి చేరకుని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. కోయని పంటను మూడు రోజుల పాటు కోయవద్దని రైతులకు సూచించారు. రహదారులపై ఆరబెట్టిన ధాన్యాన్ని రైతు ఆమోదం మేరకు రైతు భరోసా కేంద్రంలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసి రైస్‌మిల్లులకు తరలించారు. ఈ ప్రక్రియ అంతా వ్యవసాయ శాఖ, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల సమన్వయంతో వేగంగా చేశారు. దీంతో ముసురు భయం నుంచి అనేక మంది రైతులు విముక్తి పొందారు. ఏవో రమేష్‌కుమార్ ఆరుదల, కోతలపై రైతులకు సూచనలు చేశారు. నెలటూరు తదితర గ్రామాలను ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి సందర్శించి క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ధాన్యం తరలింపులో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిస్థితులపై జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో ఫోన్లో చర్చించారు.

సమాజంలో గుర్తింపునకు కృషి

రామచంద్రపురం: విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచి, వారికి సమాజంలో గౌరవ స్థానాన్ని కల్పించడానికి కృషి చేసిన మహనీయులు ధరమ్ స్వరూప్ నకారా, సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి వైవీ చంద్రచూడ్‌లు అని వక్తలు కొనియాడారు. స్థానిక రిటైర్డు ఉద్యోగుల సమాఖ్య కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వీరి చిత్రపటాలను రిటైర్డ్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ శాస్త్రి ఆవిష్కరించారు. సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు పట్నాల రామకృష్ణారావు, తటవర్తి రాఘవరాజు, ఆర్థిక కార్యదర్శి పీవీఎస్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు అంపోలు సత్యనారాయణ, పి.త్రినాథరావు, వుండవల్లి సత్యనారాయణ, చెరుకూరి రామ్మూర్తి, శ్రీరాములు, భాస్కరరావు తదితరులు పాల్గొని మాట్లాడారు.



ధరమ్ స్వరూప్, చంద్రచూడ్ చిత్రపటాలను ఆవిష్కరించిన శాస్త్రి తదితరులు

కారు ఢీకొని బాలుడి మృతి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలోని మారేడుబాక వంతెన వద్ద ఆదివారం కారు ఢీకొని బాలుడు మాడెం ప్రవీణ్ (11) మృతి చెందాడు. పట్టణ ఎస్సై ఎం.అశోక్ కథనం ప్రకారం... మాడెం రాంబాబు, బేబీ దంపతులు మారేడుబాక ఫైర్ స్టేషన్ సమీపంలో నివాసముంటున్నారు. వారి ఒక్కగానొక్క కుమారుడైన ప్రవీణ్ ఎంపీపీ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సైకిల్‌పై రోడ్డుపైకి రాగా కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రవీణ్ మృతి చెందగా, అతని స్నేహితుడికి స్వల్ప గాయాలయ్యాయి. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అశోక్ తెలిపారు.



మృతుడు ప్రవీణ్ (ఫైల్)

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించండి

పెదపూడి: సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ కోరారు. ఆదివారం పెద్దాడలో గ్రామస్తులకు వారధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురైన సందర్భాల్లో హెల్మెట్ లేకపోవడంతోనే ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. దీంతో సదరు కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ విధిగా ధరించాలన్నారు. యువత దురాలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. యువత మంచి ఆశయంతో ముందుకు సాగాలన్నారు. అనంతరం సైబర్ నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ప్రతినిధి దిమ్మల రాజుబాబు మాట్లాడుతూ గ్రామాల్లో జిల్లా పోలీసు అధికారులు నిర్వహిస్తున్న వారధి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాసు, ఎస్సై టి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కార్తిక సమారాధనలు ఐక్యతకు ప్రతీకలు



మాచవరంలో జమ్మిచెట్టు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు



వనసమారాధనలో భాగంగా సందడి చేస్తున్న ఆర్టిస్ట్ విజయ



ద్వారపూడిలో ఐక్యత చాటుతున్న వెలమ సంఘ నాయకులు

రాయవరం: కార్తికమాసంలో ఏర్పాటు చేసుకునే వన సమారాధనలు సమాజంలోని వివిధ వర్గాల్లో ఐక్యతను పెంచుతాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మాచవరంలో వైఎస్సార్ సీపీ నేత నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి (చంటిబాబు) సోదరుల ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ వన సమారాధనలు ప్రజల్లో ఆధ్యాత్మికతను పెంచడంతో పాటు, వనాల ప్రాధాన్యాన్ని తెలియజేస్తాయన్నారు. ముందుగా ఆయన జమ్మిచెట్టు వద్ద పూజలు చేశారు. జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ తనయుడు పిల్లి సూర్యప్రకాష్, మాజీ ఎంపీ చుండ్రు శ్రీహరి, కోస్తా ఆంధ్ర రెడ్డి సంఘం అధ్యక్షుడు కర్రి త్రినాథరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, నాయకులు మేడపాటి సురేష్‌రెడ్డి, నల్లమిల్లి వెంకటరెడ్డి, గాదంశెట్టి శ్రీధర్, ద్వారంపూడి వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పసలపూడిలో..

రాయవరం: పసలపూడిలో శ్రీకోదండరామ కొప్పువెలమ సామాజికవర్గం ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆటపాటలతో ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగింది. తొలుత ఉసిరి చెట్టు వద్ద సంప్రదాయబద్ధంగా పూజాదికాలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు, మహిళలకు పలు రకాల ఆటపాటలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. జెమిని ఛానల్ ఉప్పెన ఆర్టిస్ట్ విజయ ఆటపాటలతో సందడి చేశారు.

ఐక్యతే లక్ష్యంగా సాగుదాం..

కపిలేశ్వరపురం (మండపేట): ఐక్యతే లక్ష్యంగా ముందుకు సాగుదామని వెలమ సామాజికవర్గ ప్రముఖులు అన్నారు. ఆదివారం ద్వారపూడిలో వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన జరిగింది. ముఖ్య అతిథులుగా మండపేట ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సామాజిక వర్గం అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ద్వారపూడి, జెడ్.మేడపాడు, వేములపల్లి గ్రామాల వెలమ సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, వెలమ సంఘ అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు రొంగల అప్పాజీ, రాయవరం ఎంపీటీసీ సభ్యుడు నవుడు వెంకటరమణ, సంఘ నాయకులు సత్యనారాయణ మాస్టారు, కుండ్రపు వీర్రాజు, కుండ్రపు పెంటయ్య, బండారు వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, శ్రీను, సిరిపురపు సూరిబాబు పాల్గొన్నారు.

టేకిలో సీసీ రోడ్ల నిర్మాణం



టేకిలో సీసీ రహదారి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న జేఈ రాఘవులు

కపిలేశ్వరపురం: మండలంలోని టేకి ఎస్సీ, బీసీ ప్రాంతాల్లో రూ.16 లక్షలతో సీసీ రహదారులను నిర్మిస్తున్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పర్యటించినప్పుడు గ్రామస్తులు పలు సమస్యలను ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం పేరుతో గ్రామాభివృద్ధికి ఎమ్మెల్సీ తోట రూ.20 లక్షలు మంజూరు చేయించారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, సర్పంచ్ కుక్కల నాగమణి, ఎంపీటీసీ సభ్యురాలు ఉమ్మిడిశెట్టి వీరవేణి, పంచాయతీ వార్డు సభ్యుల చొరవతో రూ.16 లక్షలతో రహదారుల నిర్మాణం వేగంగా జరుగుతుంది. పంచాయతీ రాజ్ జేఈ డీవీ రాఘవులు ఆదివారం ఎస్సీ ఏరియాలోని రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ మణికంఠ ఉన్నారు.

ఆలయ వార్షికోత్సవం

బిక్కవోలు: పందలపాక గ్రామంలో రావిచెట్టు వద్ద ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయ 23వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి క్షీరాభిషేకం చేశారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్ర ప్రగతి



బాలవరంలో వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి
- వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు

రంగంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం ప్రగతి పథాన పయనిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బాలవరం గ్రామంలో టీడీపీకి చెందిన చప్పిడి ఉమాగౌరీ, చప్పిడి శ్రీను, పంపన శ్రీను, పితాని దుర్గ, మేడిశెట్టి గంగరాజు, కోలా సుబ్బారావు, బి.లోవగణేష్, మేడిశెట్టి నాగేశ్వరరావు, గుబ్బల వెంకన్న, మేడిశెట్టి నాగరాజు, మేడిశెట్టి గనిరాజు తదితరులు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలతో అన్నివర్గాలకూ మేలు జరుగుతుందన్నారు. గత టీడీపీ హయాంలో ఒక్క పథకమూ అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో టీడీపీ నాయకులు ఇప్పుడు కళ్లబొల్లి హామీలు ఇస్తున్నారన్నారు. పథకాలు అమలు కావాలంటే తిరిగి వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు, నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులమై వైఎస్సార్ సీపీ చేరామని ప్రకటించారు. అలాగే కోటపాడు గ్రామానికి చెందిన కర్రి శ్రీనివాస్, శ్రీరామశర్మలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేశారు. జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు, మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, సర్పంచ్ గవరసాని లక్ష్మీదుర్గ, ఎంపీటీసీ సభ్యుడు సుంకర అప్పారావు, పార్టీ కన్వీనర్ గవరసాని వెంకటరమణ పాల్గొన్నారు.

నాటుకోడి.. ఆదాయం భలేనండి

- పెంపకంతో మహిళలకు ఆర్థిక పురోగతి
- ప్రస్తుతం కోళ్లకు పెరుగుతున్న డిమాండ్

రాయవరం: గతంలో చుట్టాలు ఇంటికి వస్తే వెంటనే పెరట్లో పెరిగే నాటు కోడిని కోసి కూర వండి అతిథులకు వడ్డించడం మర్యాద. ఇది నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఉంది. వివిధ కారణాలతో గ్రామీణ ప్రాంతాల్లోనూ నాటుకోళ్ల పెంపకం తగ్గింది. పౌల్ట్రీలు పెరగడం.. మార్కెట్లో కోడి మాంసం విరివిగా దొరకడంతో నాటుకోళ్ల పెంపకం తగ్గింది. ఇటీవల కాలంలో తిరిగి నాటుకోడి మాంసం తినే వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. దీంతో వీటి పెంపకంపై నియోజకవర్గంలోని మహిళలు ఆసక్తి కనబరుస్తున్నారు. మరో 40 రోజుల్లో సంక్రాంతి పండగ రానుంది. సంక్రాంతి నేపథ్యంలో నాటుకోళ్లకు డిమాండ్ పెరుగుతుంది. కొన్నేళ్లుగా నాటుకోడి మాంసానికి డిమాండ్ పెరగడంతో గ్రామీణ ప్రాంతాల్లో పెంపకం ఊపందుకుంది. ఈ పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కూడా రాయితీలను అందజేస్తుంది.

ధర మాత్రం ఎక్కువ

నాటుకోళ్లకు గుడ్లు పెట్టే సామర్థ్యం, మాంసం ఉత్పత్తి తక్కువగా ఉంటుంది. కానీ వీటి ధర మాత్రం ఎక్కువగా ఉంటుంది. వీటిని పెంచడానికి ప్రత్యేక వసతి, యంత్ర సామగ్రి అవసరం లేదు. ఇవి మిగులు పదార్థాలు, గింజలు, చిన్న గడ్డి పరకలు, పొట్టు, క్రిమికీటకాలను తిని పెరుగుతాయి. నాటుకోడి సంవత్సరానికి 40 నుంచి 60 గుడ్లు పెడుతుంది. ఇందులో 20 శాతం అంటే పది గుడ్లను పొదగడానికి వినియోగిస్తే 21 రోజులకు పది పిల్లలు వస్తాయి. పొదగడం ప్రారంభించిన తర్వాత కోడిని రెండు రోజులకోసారి మేతకు వదలాలి. పొదిగిన పిల్లల్లో కొన్ని వివిధ కారణాలతో చనిపోయినా ఐదు పిల్లలు మిగులుతాయి. ఈ పిల్లలు పెరిగి పెద్దయ్యాక బరువు సుమారు 1.5 కిలోలు వచ్చాక మార్కెట్ ధర ప్రకారం కోడికి రూ.1,500 వరకు ధర వస్తుంది. ఐదు కోళ్లకు దాదాపు రూ.7,500 వరకు ఆదాయం వస్తుంది. పొదగడానికి కాకుండా మిగిలిన గుడ్ల నుంచి ఏడాదికి కనీసం రూ. 200 వస్తుంది. ఒక నాటు కోడి పెట్ట నుంచి ఏడాదికి రూ.1,800 వరకూ లాభం పొందే అవకాశం ఉంది. వీటి పోషణకు ప్రత్యేక ఖర్చు అవసరం లేదు. పెరటి కోళ్లకు ముఖ్యంగా అజొల్లాను మేతగా వాడుకోవచ్చు. నీటి మీద తేలియాడే చిన్న చిన్న ఆకులు, వేర్లు కలిగిన ఫెర్న్ జాతికి చెందిన ఈ మొక్క కోళ్లకు మేతగా రోజుకు 50 గ్రాముల వరకు వేసుకోవచ్చు. అజొల్లా పెంపకానికి పెద్దగా ఖర్చు ఉండదు. దీన్ని సులువుగా ఇంటి పరిసరాల్లోనే చిన్న చిన్న గుంతలు, సిమెంట్ గాజులో నీటిని పోసి అందులో పెంచుకోవచ్చు.



నాటుకోళ్లు

ఈ మాంసానికి డిమాండ్

నాటుకోడి మాంసానికి ఇటీవల కాలంలో డిమాండ్ బాగా పెరిగింది. ముఖ్యంగా ఆదివారం దుకాణాల వద్ద ప్రత్యేకంగా అమ్మకాలు చేస్తున్నారు. పర్వదినాలు, ప్రత్యేక కార్యక్రమాల్లో మాంసాహార ప్రియులు నాటుకోడి మాంసానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. కిలోన్నర మాంసం వచ్చే నాటుకోడి (పెట్ట) ధర సుమారు రూ.1,200 నుంచి రూ.1,500 వరకు ఉండగా, అదే పుంజు అయితే రూ.2 వేల వరకు ఉంటుంది.

వివేకానందుని బోధనలు మార్గదర్శకం



మాట్లాడుతున్న సేవ్యానందజీ మహరాజ్

అనపర్తి: స్వామి వివేకానందుని బోధనలు సమాజానికి మార్గదర్శకమని రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం ప్రతినిధి స్వామి సేవ్యానందజీ మహరాజ్ అన్నారు. అనపర్తి శ్రీరామకృష్ణ సేవా సమితి, జీబీఆర్ విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద టాలెంట్ టెస్ట్ 2023ను ఆదివారం జీబీఆర్ విద్యాసంస్థల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సేవ్యానందజీ మహరాజ్ తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేవండి.. మేల్కొనండి.. గమ్యం చేరేవరకు విశ్రమించకండి అంటూ నిద్రాణమై ఉన్న ఆత్మను మేల్కొలిపి యువశక్తిని జాగృతం చేయడంతో పాటు జాతి పురోగతికి మార్గనిర్దేశం చేసిన వివేకానందుని బోధనలు అనుసరణీయమన్నారు. వివేకానుందుని ఆశయాలకు అనుగుణంగా నేటి యువత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రామకృష్ణ మిషన్ సభ్యుడు ఎం.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 8 మండలాల పరిధిలో 60 పాఠశాలలకు చెందిన సుమారు 1,800 మంది పదో తరగతి విద్యార్థులు ఈ టాలెంట్ టెస్ట్‌కు హాజరైనట్లు చెప్పారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన 180 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఈ నెల 10న మండల స్థాయిలో పోటీ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు స్వామి వివేకానంద ప్రతిభా పురస్కారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జీబీఆర్ పీజీ కోర్సుల డైరెక్టర్ బి.రత్నారెడ్డి, జీబీఆర్ పాలకమండలి సభ్యుడు గొలుగూరి రామారెడ్డి, పూర్వపు ప్రిన్సిపాల్ జి.జగన్నాథరెడ్డి, సమితి ఉపాధ్యక్షులు సత్తి వెంకటరెడ్డి, తేతలి సుందరరామారెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి, కార్యదర్శులు తాడి చంద్రశేఖర్‌రెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి సత్తిరెడ్డి, జీబీఆర్ డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్‌పీ అబ్బాయిరెడ్డి, పీఆర్ఎల్ స్వామి పాల్గొన్నారు.